## అక్రమమైతే..సీజ్

(మొదటిపేజీ తరువాయి)

ఆఫీసుకు సమాచారాన్ని చేరుస్తారు. న్యాయస్థానం పరిధిలో అప్పటికే ఈ అంశం ఉంటే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం, కౌన్సిల్ మీటింగ్‌లో నివేదిక అందించనున్నారు. అయితే కమిషనర్ లేదా న్యాయస్థానం ఆదేశాలు లేకుండా సీల్ తొలగించే అధికారం ఎవరికీ లేదు. డిప్యూటీ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని జోనల్ కమిషనర్ , జోనల్ కమిషనర్ సీజ్ చేసిన భవనాన్ని కమిషనర్ మాత్రమే తొలగించాల్సి ఉంటుంది.

### కచ్చితంగా సుప్రీంకోర్టు నిబంధనల అమలు

స్థానిక అధికారులు ఆమోదించిన బిల్డింగ్ ప్లాన్‌ను సంబంధిత బిల్డర్ కన్‌స్ట్రక్షన్ సమయంలో డిస్‌ప్లే చేయాలి. ఈ ప్లాన్ లేకుండా చేపట్టే నిర్మాణాలను నిలిపివేయాలి. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నట్లు కోర్టు దృష్టికి వస్తే వాటిని ఆపాలి. ఏ మాత్రం కనికరం చూపకూడదు. కారణాలు చూపి అక్రమ నిర్మాణాలకు అనుకూలంగా వ్యవహరించకూడదు. బిల్డింగ్ ప్లాన్‌కు ఆమోదం తెలిపే సమయంలో సదరు బిల్డర్ నుంచి హామీ పత్రం తీసుకోవాలి. బిల్డింగ్ ఓసీ వచ్చాకనే కొనుగోలుదారులకు అప్పగిస్తామని ఆ హామీలో తెలపాలి. – ఓసీ వచ్చాకనే జలమండలి, విద్యుత్, ఇతర శాఖలు సంబందిత సౌకర్యాలను ఇవ్వాల్సి ఉంటుంది. తదితర అంశాల్లో ఏ ఒక్క ఆదేశాన్ని ఉల్లంఘించిన కోర్టు దిక్కరణ కిందకే వస్తుందని న్యాయస్థానం పేర్కొన్న సంగతి తెలిసిందే.

## ఓల్డ్‌సిటీ మెట్రోకు నిధులు మంజూరు

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): ఓల్డ్ సిటీ మెట్రో కోసం పురపాలక మంత్రిత్వ శాఖ నిధులు మంజూరు చేసింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండో దశ విస్తరణ కోసం రూ.125 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ్‌గుట్ట వరకు 7.5 కిలో మీటర్ల మేర మెట్రోను నిర్మిస్తుండగా.. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియను చేపట్టింది. తాజాగా విడుదలైన నిధులను ప్రాజెక్టు కోసం వినియోగించాలని ఎంఏయూడీ సెక్రటరీ ఇలంబర్తి జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు

సిటీబ్యూరో, జూన్ 16(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో నాలాల ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కమిషనర్ రంగనాథ్ నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. 47 ఫిర్యాదులు రాగా వాటిపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# అటకెక్కిన మెట్రో ఫేజ్-2

- కేంద్రానికి చేరిన డీపీఆర్
- ఆరు నెలలు గడిచినా.. లభించని మోక్షం
- టెక్నికల్ సమస్యలపై చర్చలతో కాలయాపన
- విస్తరణ ప్రతిపాదనలపై కాంగ్రెస్ సర్కార్ కంటితుడుపు చర్యలు



సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): మెట్రో ఫేజ్-2 విస్తరణ అటకెక్కింది. కేంద్రానికి చేరిన డీపీఆర్‌కు ఆరు నెలలు గడిచినా.. మోక్షం లభించడం లేదు. డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలిపితే గానీ, హైదరాబాద్ కేంద్రంగా మెట్రో విస్తరణకు తావు లేదు. నిజానికి ఈ ప్రక్రియ ఎప్పుడో పూర్తి కావాల్సింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా విస్తరణ ప్రతిపాదనలపై కంటి తుడుపు చర్యలతో నెట్టుకొస్తున్నది. దీంతో డీపీఆర్ ప్రతులు ఢిల్లీకి చేర్చిన మెట్రో బృందం... ఇక అడపాదడపా ఢిల్లీ, హైదరాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్నానే తప్పా... స్పష్టమైన హామీ ఇప్పటికీ అందలేదు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి తీసుకువచ్చే ఆలోచన చేయకపోవడంతో... అట్టహాసంగా ప్రకటించిన మెట్రో ప్రాజెక్టులో జరుగుతున్న జాప్యంతో ఆశలు నీరుగారిపోతున్నాయి.

### కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూపు

గతేడాది నవంబర్ నెలలో డీపీఆర్ కేంద్రానికి చేరగా... ఇప్పటివరకు హైద్రాబాద్ మెట్రో ప్రతిపాదనలపై కేంద్రం ఏ నిర్ణయం తీసుకోలేదు. మెట్రో ఫేజ్-2 కోసం విస్తరించేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సన్నాహాలు చేసింది. ఇప్పటికే డీపీఆర్ ప్రతులను కేంద్రానికి అందజేసింది. ప్రాజెక్టు అంచనా వ్యయంలో 48 శాతం మేర జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ( మల్టీ లెటరల్) వంటి ఆర్థిక సంస్థలతో ప్రాజెక్టు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో మిగిలిన రాష్ట్ర ప్రభుత్వం రూ. 7313 కోట్లు (30 శాతం), కేంద్ర వాటా రూ. 4230 కోట్లు(18 శాతం) మేర చేపట్టనున్నది. ఇతర ఆర్థిక సంస్థల నుంచి తీసుకునే అప్పులకు కేంద్రం గ్యారెంటీ ఇవ్వనున్నది. మిగిలిన 4 శాతం మేర రూ. 1033 కోట్లను పీపీపీ విధానంలో సమకూర్చి ప్రాజెక్టును చేపట్టేలా డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును హైదరాబాద్ మెట్రో సంస్థ తయారు చేసింది. రెండో దశలో ఆరు కారిడార్లలో 116.4 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించనున్నట్లు తెలిపారు. ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్లు, ఆరో కారిడార్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీకి 40 కిలోమీటర్లు, నార్త్ సిటీకి మరో 44 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరించేందుకు ప్రతిపాదనలను తయారు చేయాల్సి ఉంది. అయితే మిగిలిన 5 కారిడార్ల నిర్మాణానికి అవసరమైన నివేదికలను రూపొందించగా, ఇప్పటికీ కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూస్తున్నది.

### ఆరు నెలలు గడిచినా..

తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం నుంచి భారీ ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇందులో మెట్రో నిర్మాణానికి అంచనా వేసిన రూ. 4230 కోట్లు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. కనీసం డీపీఆర్‌కైనా ఆమోదం లభిస్తుందని భావించినా... ఇప్పటికీ వరకు ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. అయితే డీపీఆర్ ఆమోదానికి మరో మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. ఇప్పటికే నార్త్ సిటీ, ఫోర్త్ సిటీ ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించగా, త్వరలోనే కేంద్రానికి అందజేయనున్నారు. మూడు నెలలోగా డీపీఆర్‌కు ఆమోదం తెలిపితే... కనీసం సెప్టెంబర్ నాటికైనా పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పటికీ టెక్నికల్ సమస్యలపై కేంద్రం లేవనెత్తుతున్న సందేహాల నివృత్తితోనే ఆరు నెలలు సమయం గడిచిపోయింది.

## రిజర్వేషన్లు తేలాకనే ఎన్నికలు నిర్వహించాలి

### తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



సమావేశంలో పాల్గొన్న ఎర్ర సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం నేతలు

రవీంద్రభారతి జూన్ 16 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేశాకనే స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఈనెల 18న ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం బషీర్ బాగ్ దేశోద్దారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ రక్షిత చట్టం తేవాలన్నారు. లేని పక్షంలో డిల్లీలో కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కులగణన ప్రభుత్వ అసెంబ్లీ తీర్మానాలు, బీసీ కమిషన్ సానుకూల నివేదికల తదనంతరం కూడా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రాన్ని ఒప్పించటానికి యుద్ధ ప్రతిపాదికన కార్యాచరణ చేపట్టాలని సూచించారు. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీ రేజర్వేషన్లను ఇస్తామన్న ప్రధాని హామీతోనే కాంగ్రెస్‌ను గద్దెనెక్కించామన్నారు. 42శాతం రేజర్వేషన్లను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నాయకులు కోలా జనార్దన్, నాగుల శ్రీనివాస్ యాదవ్, గోపి బోయ, సుధాకర్ ముదిరాజ్, ఉదయ్ నేత, శివమ్మ, పద్మ, భాగ్యలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన



కలెక్టర్ హరిచందనకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి పనుల కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆమె సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో పరిచయ సమావేశంలో పాల్గొన్నారు. పరిపాలనలో ఎటువంటి సమస్యలు లేదా సందేహాలు ఉన్నా సిస్సంకోచంగా నేరుగా తనను సంప్రదించాలని.. సంక్షేమ, వైద్య, రెవెన్యూ శాఖలపై తమ ప్రత్యేక దృష్టి ఉంటుందని పేర్కొన్నారు. అంతకుముందు అధికారులు కలెక్టర్‌కు బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ జీ ముకుంద రెడ్డి, డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణికి 147 దరఖాస్తులు..

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారంనిర్వహించిన ప్రజావాణిలో 147 దరఖాస్తులను ఆమె స్వీకరించారు.

## పనుల్లో వేగం పెంచండి

సిటీబ్యూరో, జూన్16, (నమస్తే తెలంగాణ): ఎస్టీపీల నిర్మాణ ప్రాజెక్టు ప్యాకేజ్-1లో భాగంగా అంబర్‌పేట్‌లో నిర్మిస్తున్న 212.5 ఎమ్మెల్డీ సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) నిర్మాణ పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఎంఆర్డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డిలతో కలిసి సోమవారం సందర్శించారు. పనుల్లో వేగం పెంచి పెంచాలని, అంతర్గత రహదారులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎండీ పేర్కొన్నారు. మిగిలిపోయిన సివిల్ వర్క్‌లు, సుందరీకరణ కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్, పెయింటింగ్ పనుల్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి రెండు మూడు రోజుల్లో ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

## పేదల ఇంటిపై బుల్డోజర్లు



గిరిప్రసాద్‌నగర్ కాలనీలో మహిళల్ని ఈడ్చుకెళ్తున్న పోలీసులు

- జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణల పేరిట ఇళ్ల కూల్చివేత
- అడ్డొచ్చిన మహిళలను ఈడ్చుకెళ్లిన పోలీసులు
- కాంగ్రెస్ మా బతుకులను ఆగం చేసిందంటూ బాధితుల శాపనార్థాలు

జవహర్‌నగర్, జూన్ 16: సారూ... మేము ఇళ్లల్లో పారిశుద్ధ్య పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ... పైసాపైసా కూడబెట్టి 60 గజాల్లో రేకుల ఇంటిని నిర్మించుకుంటే మాలాంటి పేదల ఇళ్లపైకి బుల్డోజర్ తీసుకువచ్చి నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయడం మీకు తగునా అంటూ కాప్రా రెవెన్యూ అధికారులను జవహర్‌నగర్ ప్రజలు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పేదల బతుకులు మారుతాయనుకుంటే మా కడుపుకొడుతుంటే మేమెట్లా బతకాలి సార్ అంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు.. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆధ్వర్యంలో జవహర్‌నగర్ పోలీసుల సమక్షంలో సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో పలు కాలనీల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ గిరిప్రసాద్‌నగర్‌లో ఇళ్ల మధ్యలో 60గజాల్లో నిర్మాణం చేసుకుంటున్న బోనగిరి లక్ష్మి ఇంటిని రెవెన్యూ యంత్రాంగం కూల్చివేసింది. మా ఇంటిని కూల్చొద్దు... మేము రోడ్డుమీద పడతాం అంటూ కుటుంబ సభ్యులు వేడుకున్నా రెవన్యూ అధికారులు పట్టించుకోకుండా పోలీసులు మహిళను ఈడ్చుకెళ్లి ఇంటిని కూల్చివేశారు. బాధితులను పోలీసులు ఈడ్చుకుపోతుంటే ఓ పెంపుడు కుక్క అడ్డుకోబోతూ పోలీసులపైకి మొరుగుతూ రక్షణగా నిలవడంతో అక్కడున్నవారంతా కన్నీటిపర్యంతమయ్యారు. జవహర్‌నగర్‌లోని ఏళ్లనాటి కాలనీలలోకి రెవెన్యూ అధికారులు వెళ్లి బుల్డోజర్‌తో కూల్చివేయడంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబిక్కాయి. రెవెన్యూ అధికారులకు పేదోళ్ల ఇళ్లను కూల్చుతూ... పెద్దోళ్ల జోలికి వెళ్లడం లేదంటూ విమర్శలు గుప్పించారు. పేదల జోలికి వచ్చిన ప్రభుత్వంపై శాపనార్థాలు గుప్పించారు. నిరుపేదలపై పోలీసులు చూపించిన కర్కశత్వంపై అక్కడున్నవారతా నివ్వెరపోయారు. ఎంతచెప్పిన వినిపించుకోకుండా అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. రెవెన్యూ అధికారులు సాయి, రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

### మంత్రి పొన్నం ప్రభాకర్

అమీర్‌పేట్, జూన్ 16: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం దేవాలయ ఆవరణలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన ఆధ్వర్యంలో జరిగిన ఈ సమీక్షలో దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, గ్రేటర్ మేయర్ విజయలక్ష్మి గద్వాల్, నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కేతినేని సరళ, దేవాలయ చైర్మన్ కొత్తపల్లి సాయిబాబా గౌడ్, దేవాలయ ఈవో మహేందర్ గౌడ్‌తోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. జూలై 1న జరిగే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు హాజరయ్యే భక్తుల కోసం చేపట్టాల్సిన పనులపై జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు అధికారులకు మంత్రి సూచనలు చేశారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



కూచిపూడి అరంగేట్రం చేస్తున్న సాహితి పద్మప్రియ

రవీంద్రభారతి,జూన్16: ప్రముఖ నాట్య గురువు జ్యోతిరెడ్డి శిష్యురాలు కూచిపూడి కళాకారిణి సాహితీ పద్మప్రియ కూచిపూడి అరంగేట్రం ప్రదర్శన జ్యోతి కళాక్షేత్రం ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఆర్ఎస్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (ఇన్వెస్టిగేషన్)డైరెక్టర్ ఆనంద్ రాజేశ్వర్ బైవార్, ఐఆర్ఎస్, ప్రొఫెసర్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్(సెంట్రల్)ఆర్విరెడ్డి, ఐఆర్ఎస్ ప్రొఫెసర్ డైరెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (ఇన్వెస్టిగేషన్) రాజ్‌గోపాల్‌చర్మ మానస, బాబు తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. సాహితి పద్మప్రియ, జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతూ కూచిపూడి డ్యాన్స్‌పై మక్కువతో 6 సంవత్సరాల వయస్సులోనే నృత్యాన్ని ప్రారంభించి అరంగేట్రం ప్రదర్శించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో సాహితీ పద్మప్రియ మరిన్నీ ప్రదర్శనలు ఇచ్చి తల్లిదండ్రులను, నాట్యగురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పద్మప్రియ తల్లిదండ్రులు, అభిమానులు పాల్గొన్నారు.

## బల్దియాకు బకాయిదారుల టోకరా

- ట్యాక్స్ వసూళ్ల సమయంలో చెల్లని చెక్కుల అందజేత
- 30 సర్కిళ్ల పరిధిలో 2,145 మంది గుర్తింపు
- నోటీసులు ఇస్తున్న అధికారులు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఆస్తిపన్ను చెల్లింపులలో బకాయిదారులు బల్దియాకు టోకరా వేస్తున్నారు. బకాయిల వసూళ్లకు సిబ్బంది వెళ్లిన సమయంలో కొందరు చెక్‌లు ఇస్తున్నారు. ఐతే అవి కాస్తా బౌన్స్ అవుతున్నాయి. సాంకేతిక కారణా(చెక్‌లో పొందుపర్చిన డేట్, యాజమాని సంతకం, రాతలో మిస్టేక్ ఇతర వాటితో)లతో ఎక్కువగా చెక్ బౌన్స్‌లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే 30 సర్కిళ్ల పరిధిలో 2,145 మంది చెక్‌లు బౌన్స్ (చెల్లని చెక్కులుగా) అయినట్లు అధికారులు తెలిపారు. చెల్లని చెక్కుల రూపంలో రూ.30.11 కోట్లుగా ఉందని అధికారులు పేర్కొన్నారు. అత్యధికంగా బేగంపేట సర్కిల్‌లో 115 మందికి గానూ రూ.3.12కోట్లు, సరూర్‌నగర్‌లో 145 మంది రూ.2.87కోట్లు, జూబ్లీహిల్స్‌లో 133 మంది రూ.2.39 కోట్లు చెల్లని చెక్కులుగా ఉన్నట్లు చెప్పారు. చెక్కులు బౌన్స్ అయ్యే వాటిలో ఎక్కువగా కమర్షియల్ ప్రాపర్టీదారులలే ఉన్నాయని, కొందరు ఖాతాల్లో నగదు లేకున్నా చెక్కులు చేశారని గుర్తించారు. చెక్ బౌన్స్ అయిన వారికి సెక్షన్ 138 ప్రకారం బల్దియా అధికారులు నోటీసులు పంపుతున్నారు. చర్యలు తీసుకుంటామని స్పష్టం నోటీసుల్లో పేర్కొంటున్నారు. అయితే వారిలో కొందరు తిరిగి పన్ను చెల్లిస్తుండగా, మరికొంతమంది మొండికేస్తున్నట్లు సమాచారం.

## సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్



సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ప్రజావాణి సమస్యల పరిష్కారంలో జాప్యం చేయవద్దని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో కమిషనర్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో 74 విన్నపాలు రాగా, ఆరు జోన్లలో మొత్తం 91 ఆర్జీలను స్వీకరించారు. అడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

### మాన్‌సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్

బల్దియా పరిధిలో మాన్‌సూన్ శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. సోమవారం కమిషనర్.. నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ సమీపంలో జరుగుతున్న మాన్‌సూన్ శానిటేషన్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు.

# కొందరికే పుస్తకాలు

- సర్కార్ బడుల్లో ఆధార్ ఇవ్వలేదని పంపిణీ నిలిపివేత
- 11వేలకు పైగా విద్యార్థుల ఎదురుచూపు
- యూడైస్‌లో వివరాలు ఎక్కించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అంటున్న తల్లిదండ్రులు

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఓవైపు బడులు పునఃప్రారంభం అయ్యాయనే సంబురం.. మరోవైపు చదువుకునేందుకు పుస్తకాలు లేవనే బాధ విద్యార్థులను వెంటాడుతోంది. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నగరంలో 11వేల మంది విద్యార్థులకు ఇప్పటివరకు పాఠ్య పుస్తకాల పంపిణీ జరగలేదు. ఈ విషయమై విద్యార్థులు, తల్లిదండ్రులు సంబంధిత పాఠశాలల టీచర్లను నిలదీయగా.. ''మీరు ఆధార్ కార్డు అందించలేదని.. మీ వివరాలు యూడైస్ యాప్‌లో ఎక్కలేదని' చేతులు దులుపుకున్నారు. అయితే యూడైస్ ప్రక్రియ అనేది అధికారుల చేతిలోనే ఉంటుంది. పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల, టీచర్ల వివరాలన్నీ అందులో నిక్షిప్తం చేస్తుంటారు. గతేడాది సైతం అందరి విద్యార్థుల వివరాలు సేకరించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి సంబంధించి సరిపడా పుస్తకాలు పాఠశాలలకు సరఫరా కాకపోవడంతోనే ఆధార్ సాకు చూపి చాలామంది విద్యార్థులకు పుస్తకాలను అందించలేకపోయారు. ఆధార్ కార్డు లేకపోయినా విద్యార్థుల వివరాలు స్కూల్ రిజిస్టర్‌లో నమోదై ఉన్నాయి.. ఆ వివరాల ఆధారంగా పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తోటి స్నేహితులకు పుస్తకాలు వచ్చి తమకు రాకపోవడంతో వాళ్లంతా నిరుత్సాహం చెందుతున్నారు. ఉపాధ్యాయులు నిర్వర్తించాల్సిన బాధ్యత తమపై నెట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థుల సంఖ్యకు సరిపడా అందని పుస్తకాలు..

జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో 94,339 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 713 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు సుమారు 12.50 లక్షల పుస్తకాలు, 6.20లక్షల నోట్‌బుక్స్‌ను ముద్రించినట్టు అధికారులు తెలిపారు. మండలాలవారీగా ప్రతీ పాఠశాలకు అందులో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా పుస్తకాలను సరఫరా చేసినట్టు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా పుస్తకాలు అందటం లేదని విమర్శలున్నాయి. కాగా యూడైస్ వివరాల ఆధారంగానే విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివరాలు, వసతులు, ఆధార్ అనుసంధానం, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాం పంపిణీ, పాఠ్యపుస్తకాల సరఫరా జరుగుతుందని అధకారులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా పుస్తకాలు అందనివారికి అందించాలని విద్యార్థుల తల్లదండ్రులు కోరుతున్నారు.

# అభ్యంతరాలపై వివరణ ఇవ్వాల్సిందే..

- గ్రామ, ప్రజాభిప్రాయ సేకరణ సభలు బహిష్కరించినా.. వివరణ చెప్పాలంటూ నోటీసులు
- ఎలివేటెడ్ కారిడార్ బాధితులపై ప్రభుత్వ ఒత్తిడి
- ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు



సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు బాధితులపై ఒత్తిడి పెరుగుతోంది. భూసేకరణ, ప్రాజెక్టు వెడల్పు తగ్గింపు, పరిహారం విషయంలో స్పష్టత రానంత వరకు ప్రాజెక్టుకు భూములు ఇచ్చేది లేదంటూ బాధితులు తేల్చి చెబుతుండటంతో..భూసేకరణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధితులే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. బాధితులు ఓ వైపు న్యాయపోరాటం, మరో వైపు ఉద్యమ బాట పట్టారు. అయినా గడిచిన ఆరు నెలలుగా నిర్వహించిన ఐదారు గ్రామసభలు, ఒక ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాలను బాధితులు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం అభ్యంతరాలపై వివరణ ఇవ్వాల్సిందేనంటూ తాజాగా నోటీసులు జారీ చేస్తున్నది. బాధితుల ఇంటింటి గోడలపై నోటీసులను అంటిస్తూ ఈ నెల 27న జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు రావాలని ఆదేశిస్తున్నారు. ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తున్నారనే విషయాన్ని ఇప్పటికే బాధితులు కుండ బద్దలు కొట్టినట్లుగా చెబుతున్నా... పట్టించుకోవడం లేదు. కానీ సమావేశాలకు రావాలంటూ నోటీసులు జారీ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తమ సమస్యలను పరిష్కరించకుండా భూముల విషయం తేలదని చెబుతూనే...ఆందోళన చేసేందుకు బాధితులు సన్నద్ధమవుతున్నారు.

### భూసేకరణ అధికారుల ఒత్తిడి

హెచ్ఎండీఏ చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూములు ఇవ్వాల్సిందేనంటూ భూసేకరణ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా భూములు ఇచ్చేది లేదని చెబుతున్నా... పట్టించుకోకుండా.. ప్రజాభిప్రాయ సేకరణకు రావాలంటూ భవన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. బాధితులు అందుబాటులో లేకున్నా... ఇంటి గోడలపై నోటీసులను అంటించి వెళ్తున్నారు. ఇలా భూములు ఇచ్చేంత వరకు వదిలేది లేదన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. అయితే తమ సమస్యలను పరిష్కరించకుండా, భూ సేకరణకు సహకరించేది లేదని బాధితులు స్పష్టంగా చెబుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంపై ఆందోళన చెందుతున్నారు.

### ప్రజాభిప్రాయ సేకరణకు రావాల్సిందే..

బాధితులు ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తున్నారనే విషయాన్ని తెలుసుకోకుండా... అధికారులు కూడా భూసేకరణ విషయంలో పట్టుబడుతున్నారు. ప్రాజెక్టు వెడల్పును 200 మీటర్ల నుంచి 100-150 మీటర్లకు తగ్గించడం వల్ల ఎంతో మంది భూ యజమానులకు ఊరట కలుగుతుందని, కానీ ప్రభుత్వం ఆ విషయమే పట్టించుకోకుండా ఒంటెద్దు వ్యవహారం చేస్తున్నదని మండిపడుతున్నారు. ఇక పరిహారం విషయంలోనూ తమకు స్పష్టమైన హామీ రాలేదని వాపోతున్నారు. అసమగ్రమైన సమాచారంతో తమ ఆస్తులను ఎలా అప్పగిస్తామని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈనెల 27న లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్రతి భూ యజమాని హాజరు కావాలని అధికారులు నోటీసులో పేర్కొన్నారు.